ముక్కోటి ఏకాదశి సందర్భంగా దేవుని కడప శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి బారులు తీరిన భక్తులు

సూపర్ సిక్స్ అమలు ఇంకెప్పుడో..!

- 7 నెలలైనా అమలు కాని కీలక హామీలు
- చంద్రన్న బీమా అమలుపైనా నిర్లక్ష్యమే
- సంక్రాంతి కానుకకు మంగళం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు ఇంకెన్నాళ్లు అని ప్రజలు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచినా ఉచిత గ్యాస్ కనెక్షన్, పింఛను మినహా మిగిలిన వాటి అమలకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజల్లో ఆందోళన నెలకొన్నాయి. పథకాలకు పేర్లు ప్రకటించడమే అప్ప అమలు చేయడం ఆలస్యం అవుతోంది. కూటమి మేని ఫెస్టో హామీలపై ప్రజల్లో తీవ్ర చర్చ సాగుతోంది. గత ప్రభుత్వం పథకాల అమలు, ప్రస్తుత ప్రభుత్వం తీరుపై జనాల్లో చర్చ పెద్ద ఎత్తు న సాగుతోంది. హామీల అమలు కాక రైతులు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లాల్లో దాదాపు 14 లక్షల వరకూ సాగుభూమి ఉంది. దాదాపు 5 లక్షల మంది రైతులు వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్నారు. వ్యవసాయం కష్టాల సాగుగా మారడంతో ప్రభుత్వ సాయం రైతులకు ముఖ్యంగా మారింది. తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామంటూ కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఏడు నెలలు గడిచి పోయింది ఖరీఫ్ పూర్తయ్యింది, రబీ ముమ్మరంగా సాగుతోంది. పెట్టుబడి సాయం మాత్రం అందలేదు. రైతులకు అత్యంత ముఖ్యమైన హామీని సైతం సకాలంలో అమలు చేయక పోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కౌలుచట్టంలో మార్పులు చేస్తామనే మాటను సైతం ప్రభుత్వం ఇప్పటికీ నెరవేర్చలేకపోయింది. ఒకటి నుంచి ఇంటర్ వరకూ గత ప్రభుత్వం అమ్మఒడి పేరుతో ఏడాదికి రూ. 15 వేలు జమ చేసింది. తాము అధికారంలోకి వస్తే కుటుంబంలో చదువుకుంటున్న ప్రతి పిల్లాడికి అమ్మకి వందనం కింద రూ. 15 వేలు చొప్పున ఇస్తామని కూటమి నేతలు చెప్పారు. ఇప్పటి వరకూ అమలు కాలేదు.

జిల్లాలో ఒకటి నుంచి ఇంటర్ వరకూ చదువుతున్న విద్యార్థులు 4 లక్షలకు పైగా ఉన్నారు. విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుతోంది. ప్రయివేటు పాఠశాలలలో ముక్కు పిండి ఫీజు వసూలు చేస్తున్నారు. తల్లికి వందనం సొమ్ములేస్తే పిల్లల ఫీజులకు ఉపయోగపడతాయని తల్లిదండ్రులు ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎప్పుడు వేస్తారో కనీసం ప్రకటించని పరిస్థితి నెలకొంది.

19 ఏళ్ళు నుంచి 50 ఏళ్ల మధ్య మహిళలకు నెలకు రూ.1500 జమ చేస్తామని చెప్పారు. అది ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. ఉద్యోగాలు వచ్చే వరకూ యువ తకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అసలు అమలు చేస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై మాటలు తప్ప ఆచరణ లేకుండా పోయింది. సూపర్ సిక్స్ పేరుతో ప్రభుత్వం చెప్పిన కీలక హామీల్లో ఉచిత గ్యాస్ పథకం ఒక్కటే ఇప్పటి వరకూ అమలు చేసిన పరిస్థితి నెలకొంది. ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించి ఆస్పత్రు లకు బకాయలు చెల్లించకపోవడంతో వారు కూడా వైద్యం అందించడం లేదు దీంతో ఇది కూడా అటకె క్కినట్లే అన్న ఆరోపణ లున్నాయి.

చంద్రన్న బీమాపైన నిర్లక్ష్యం

ఇంట్లో కుటుంబ యజమాని మృతి చెందితే ఇచ్చే చంద్రన్న బీమా సైతం ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. సహజ మరణానికి రూ. 5 లక్షలు, ప్రమాద మరణానికి రూ.10 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. బీమా అంటే కష్టకాలంలో ఉపయోగపడేదని అందరికీ తెలిసిందే. కుటుంబ యజమానిని కోల్పోయి ఎన్నో కుటుంబాలు దుర్భర పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ ఏడు నెలల కాలంలో వందల కుటుంబాలు కుటుంబ పెద్దను కోల్పోయి కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. వారి పిల్లల చదువులకు, బతుకు సవ్యంగా సాగాలనే బీమా సొమ్ములు ఆధారంగా ఉంటాయి. పథకానికి పేరు ప్రకటించినా అమలు కాని పరిస్థితి నెలకొంది.

సంక్రాంతి కానుకకు మంగళం

2014-19 మధ్యలో టిడిపి ప్రభుత్వం సంక్రాంతి కానుక కింద నిత్యావసర సరుకులకు అందించింది. గత వైసిపి ప్రభుత్వం దీన్ని నిలిపివేసింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్రాంతి కానుక ఇస్తామని అప్పట్లో ప్రకటించారు. మరో నాలుగు రోజులు సంక్రాంతి పండుగ రానుంది. సంక్రాంతి కానుక ఊసే లేకుండా పోయింది. ముఖ్యమైన పథకాల అమలులోనూ ప్రభుత్వం తాత్సారం వహిస్తుందనే విమర్శలు విన్పిస్తున్నాయి.

ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలివే..

- యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ మూడు వేల నిరుద్యోగ భృతి
- స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు 3. ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం
- ప్రతి మహిళకూ నెలకు రూ.1500 (19 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వరకూ)

- ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం (వీటిలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ఒక్కటే అమల్లోకి వచ్చింది)

పిల్లల చదువు భారం అవుతుంది

తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ. 15వేలు ఇస్తామని చెప్పి ఆలస్యం చేస్తున్నారు. స్కూల్లో మాత్రం ఫీజులు కట్టకపోతే పిల్లలను బయటకు పంపిస్తున్న పరిస్థితి. దీంతో అప్పులు చేసి ఫీజులు కట్టాల్సి వచ్చింది.

- వెంకట లక్ష్మమ్మ, వ్యవసాయ కూలీ, పులివెందుల

నిరుద్యోగ భృతి లేక యువతకు కష్టాలు

నిరుద్యోగ భృతి ఇస్తే చదువుకున్న యువత పుస్తకాలు తెచ్చుకొని చదువుకోడానికి వీలుంటుంది. కానీ ఈ పథకం ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల ఎంతోమంది పేద విద్యార్థులు చాలా కష్టాలు పడుతున్నారు.

- సాయి, నిరుద్యోగి, పులివెందుల

పెట్టుబడి కష్టమవుతుంది

పంట సాగు చేయాలంటే పెట్టుబడి కష్టమవుతుందని రైతుకు ప్రతి సంవత్సరం ఆర్థిక సహాయం చేస్తామని నిర్లక్ష్యం చేయడం వల్ల పెరిగిన ధరల దృష్ట్యా రైతుకు సాగు భారంగా మారుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం సత్వరమే ఆర్థిక సహాయాన్ని అందించాలి.

- రాజ కుళ్ళాయి రెడ్డి, రైతు లింగాల మండలం

మహిళలకు భరోసా ఎక్కడ

ప్రతి మహిళకు భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో 19 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలు లోపు ఉన్న మహిళలకు ప్రతినెల రూ.1500 ఇస్తామని చెప్పి ఇవ్వలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చి మహిళలకు అండగా ఉండాలి.

- సుజాత, గృహిణి పులివెందుల

ఫ్రెషర్స్‌డే కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఉపాధి అధికారి ఎ.సురేష్‌కుమార్

మంచి ఆలోచనలతో ముందుకెళ్లాలి

- జిల్లా ఉపాధి అధికారి ఎ.సురేష్ కుమార్

ప్రజాశక్తి - కడప

గొప్ప చరిత్ర కలిగిన కళాశాలలో సీటు వచ్చిందని, మంచి ఆలోచనలతో, ఆచరణతో జీవితంలో అనుకున్నది సాధించాలని జిల్లా ఉపాధి అధికారి ఎ. సురేష్ కుమార్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం ఊటుకూరు ప్రకృతి నగర్‌లో గల రామిరెడ్డి ఫార్మసీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జ్యోతి ప్రజ్వలన గావించి ఫ్రెషర్స్ డే వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు నాలుగేళ్లు కష్టపడి, ఇష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని పేర్కొన్నారు. రామిరెడ్డి ఫార్మసీ కళాశాల స్థాపించి 30 ఏళ్లు అయిందన్నారు. , యాజమాన్య కమిటీ ఇన్ చైర్మన్ ఈశ్వరరెడ్డి, కరస్పాండెంట్ గౌతం రెడ్డి, సెక్రటరీ జయసుబ్బరెడ్డి మాట్లాడుతూ నేషనల్ లెవెల్ జీపట్‌లో రాంక్ సాధిస్తే మొత్తం ఫీజు వాపసు చేస్తామని విద్యార్థుల హర్షాతిరేకాలు మధ్య మాట ఇచ్చారు. కళాశాల ప్రధానోపాధ్యాయులు నెల్సన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో అందుబాటులో ఉన్న అవకాశాలు ఉపయోగించుకొని రీసెర్చ్ మీద శ్రద్ధ చూపాలి తెలియజేశారు. చివరిగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ఆచార్యులు నరసింహ, మనోహర్, రాజారాం, సలోమి, సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప : స్వామి వివేకానందుని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎస్. ఇమ్రాన్ అన్నారు. స్వామి వివేకానందుని జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా యువజన సర్వీసుల శాఖ (స్టెప్) ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవ వేడుకలను కడప నగరంలోని హజరత్ ఆయేషా జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి అతిథులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి యస్. ఇమ్రాన్ మాట్లాడుతూ స్వామీ వివేకానంద 1863 జనవరి 12 న జన్మించారని, రామకృష్ణ పరమహంస ప్రియ శిష్యుడని చెప్పారు.వివేకానందుడి బోధనలు యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. స్టెప్, ముఖ్య కార్యనిర్వహణాధికారి సి. సాయి గ్రేస్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జ్ఞానం, విశ్వాసం కలిగిన వ్యక్తి, నిజమైన తత్వవేత్త అన్నారు. అతని సూక్తులు దేశ అభివృద్ధికి మార్గం సుగమం చేశాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండంట్ సుల్తాన్ మొహిద్దీన్, ప్రెసిడెంట్ యాసిన్ బాష, ప్రిన్సిపల్ కె. హసీనా బేగం, కళాశాల సిబ్బంది, సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వై.ఎస్.అభిషేక్‌రెడ్డి మృతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బంధువు, వైఎస్ ప్రకాష్ రెడ్డి మనుమడు, వై.ఎస్. మదన్మోహన్ రెడ్డి తనయుడు డాక్టర్ వైఎస్ అభిషేక్ రెడ్డి అనారోగ్య కారణంగా శుక్రవారం మృతి చెందారు. ఈయన అనారోగ్య సమస్యలతో హైదరాబాద్‌లోని ఒక ప్రయివేట్ ఆస్పత్రిలో కొన్ని నెలల కొందట చికిత్స పొందుతూ ఉన్నారు. వైసిపి వైద్య విభాగ రాష్ట్ర కార్యదర్శిగా ఆయన పని చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో లింగాల మండల వైసిపి ఇన్‌ఛార్జి పార్టీ బాధ్యతలు తీసుకొని ఎన్నిక ప్రచారంలో చురుగ్గా పాల్గొన్నారు. ఇటీవల కాలంలో అనారోగ్యంతో హైదరాబాదులో ఒక ప్రయివేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఈయన డాక్టర్ విద్య పూర్తి చేసి విశాఖపట్నంలో తన సతీమణితో కలిసి ప్రయివేట్ ఆస్పత్రిలో వైద్యులుగా పనిచేశారు. ఆయనుకు ఇద్దరు కుమార్తెలున్నారు. అభిషేక్ రెడ్డి మరణించడంతో వైఎస్ఆర్ కుటుంబం తోపాటు, వైసిపి శ్రేణుల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. రాజకీయంగా తన శైలిలో అందరి మదిలో మంచి చోటు సంపాదించుకున్నారు. ప్రజలు ఆయన దగ్గరికి వెళ్లి సమస్యలు చెప్పిన వెంటనే స్పందించేవారు. శుక్రవారం ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో హైదరాబాదులో ఒక ప్రయివేట్ ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారు ఆయన భౌతికాయాన్ని పులివెందులలోని ఆయన స్వగృహానికి తీసుకురానున్నారు శనివారం ఆయన అంత్యక్రియలు మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారు.

నిబంధనలు ఉపసంహరించుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఇటీవల విడుదల చేసిసిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనలు- 2025 ముసాయిదాను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కామనురు. శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా వైస్ ఛాన్సలర్ల నియామకం కోసం సవరించిన నిబంధన రాష్ట్రాల హక్కులపై ప్రత్యక్ష దాడిగా సిపిఎం కడప జిల్లా కమిటీ ఖండించిందన్నారు. వైస్ ఛాన్సలర్లను ఎంపిక చేసే అధికారం గవర్నర్-ఛాన్సలర్ నియమించే ముగ్గురు సభ్యుల సెలక్షన్ కమిటీకి కట్టబెట్టారన్నారు. ఈ నిబంధనతో గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో తనకు నచ్చిన వైస్‌ఛాన్సర్లలను నియమించుకుంటారన్నారు. ముసాయిదా ద్వారా విద్య అనేది ఉమ్మడి జాబితా అనే రాజ్యాంగ నిబంధనను కేంద్రం ఉల్లంఘించిందని తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - కడప : పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్. బి.అంజాద్‌బాషా పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరంలోని తన నివాస కార్యాలయంలో నూతనంగా నియమితులైన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, బంగారు నాగయ్య యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి జయచంద్రారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట కృష్ణ, చాన్‌బాష, జిల్లా సెక్రెటరీ టకోలి రమేష్ రెడ్డి, మునిశేఖర్ రెడ్డి లను కడప నియోజకవర్గం వారినిసన్మానించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ టిటిడి బోర్డు సభ్యులు యానాదయ్య, కార్పొరేటర్లు మొహమ్మద్ షఫీ, ఎస్.అజ్మతుల్లా ఖాన్, నాయకులు పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, రహీం పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను

రెగ్యులర్ చేయాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బరావమ్మ
ఒప్పందాల జిబల కోసం రిలే దీక్షలు ప్రారంభం

దీక్షలు ప్రారంభిస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు అనుబంధం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలో మున్సిపల్ మస్టర్ పాయింట్ వద్ద రిలే దీక్ష నిర్వహించారు. కార్యక్రమాన్ని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బరావమ్మ కార్మికులకు పూలమాలవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. 20 ఏళ్లుగా చాలీచాలని నామమాత్రపు వేతనాలతో ఉద్యోగ భద్రత లేకుండా కార్మికులు దుర్భర జీవితాలు గడుపుతున్నారని తెలిపారు. కార్మికులకు ఒక పే స్కేలు, డిఎ, గ్రాడ్యుటీ, పెన్షన్ లేదని వాపోయారు. 5-6 ఏళ్లకు పెంచే అరకొర వేతనం తప్ప ఎటువంటి ఎదుగు బొదుగులేని బానిస బతుకులు బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 8, 9 పిఆర్‌సి ల ప్రకారం కనీస వేతనం రూ. 3,900 నుంచి రూ. 6,700 పెంచారని చెప్పారు. 2014లో ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతి చెల్లించిన సందర్భంలో మున్సిపల్ కార్మికులకు కూడా రూ. 1,600 పెంచారని తెలిపారు. 2013లో పిఆర్‌సి వేతనాలు మధ్యంతర భృతి కరువు భత్యం, హెచ్‌ఆర్ఎ అమలు చేసేందుకు 1615 ను జారీ చేశారని .దీనిని సైతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికులకు న్యాయం చేస్తామని చెప్పిందని, ఇప్పటికే 7 నెలలు గడుస్తున్నా మున్సిపల్ కార్మికుల సమస్యల కోసం పరిష్కరిం చడానికి సమయం లేకుండా పోయిందన్నారు. ఇంజినీర్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం జీతాలు చెల్లించాలన్నారు. ఇప్పటికైనా తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి స్పందించి పర్మినెంట్ చేయాలని, లేని పక్షంలో రానున్న కాలంలో రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి మనోహర్, కార్యదర్శి సత్యం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ కుమార్, అధ్యక్ష కార్యదర్శులు శేఖర్, నాగన్న శివన్న, చెన్నయ్య , మైకేల్ పుల్లయ్య, పుళ్ళమ్మ, తిరుపాలమ్మ, రవి, వెంకట లక్ష్మీ, ప్రభావతి, లక్ష్మి, అంగన్వాడీ యూనియన్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి, అధ్యక్షురాలు బి.లక్ష్మీదేవి , ఆర్.లక్ష్మీదేవి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు భాగ్యమ్మ లక్ష్మీదేవి, సలిమ్మ, కళావతి, వరలక్ష్మి, కుసుమావతమ్మ , పారిశుధ్య కార్మికులకు మద్దతు తెలిపి అందరూ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంఘ నాయకులు విజయకుమార్, సాల్మన్ అన్నారు. రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్,యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఒక రోజు రిలేదీక్ష చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం సమ్మెకారణంగా పర్మినెంట్ చేస్తానని చెప్పి మోసం చేసిందని గుర్తు చేశారు దీక్షలో దేవదానం, స్వామిదాసు,సుధాకర్, జైకుమార్, సురేష్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-కడప అర్బన్ : నగరంలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రామమోహన్, నగర ప్రధాన కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్త రిలే నిరాహార దీక్షల్లో భాగంగా నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. 300 మంది కార్మికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులంటే ఈ ప్రభుత్వాలకు చాలా చులకన అయిపోయిందని విమర్శించారు. 20 ఏళ్లు పైబడి పని చేస్తున్న వారికి ఎటువంటి పర్మినెంట్ చేసే ఉద్దేశం కనపడటం లేదని తెలిపారు. అలాగే కోవిడ్ -19లో ప్రాణాలు తెగించి పనిచేసినటువంటి కార్మికులను కనీసం ఆప్కాస్‌లో చేర్చాలని, అడిషనల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవో36 ప్రకారం జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులకు రిటైర్మెంట్ తర్వాత బెనిఫిట్‌లు వెంటనే చెల్లించాలని చెప్పారు. సకాలంలో ఒప్పంద జీతాలను విడుదల చేయాలని కోరారు. ఇంజినీరింగ్ కార్మికులకి 36వ వితరణ సవరణ ప్రకారం జీతాలు ఇవ్వాలని పేర్కొన్నారు. క్లాప్ డ్రైవర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని, పనిముట్లు నాణ్యమైనవి కార్మికులకు ఇవ్వాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చుకునేందుకు పోరాటాలకు సిద్ధమవుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, మున్సిపల్ ఫెడరేషన్ నాయకులు సుంకర రవి, ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి విజయభాస్కర్, కోశాధికారి గోపి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఫెడరేషన్ సిఐటియు అనుబంధం కడప నగర కమిటీ నగర అధ్యక్షులు చంద్ర రెడ్డి గారు మున్సిపల్ పెడరెషన్ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపాల్, మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి విజయభాస్కర్, కార్మికులు పాల్గొన్నారు.

కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న రామమోహన్

రేపు 'సీమ' సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

'అన్నీ అమరావతికేనా? అనే అంశంపై' సీమ సదస్సును ఈనెల 12న ఉదయం 10 గంటలకు ఐఎంఎ హాల్‌లో నిర్వహించనున్నట్లు రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ డాక్టర్ సి. ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని అరవింద్ కంటి ఆసుపత్రిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సులో అతిథులుగా పిసిసి మాజీ అధ్యక్షులు డాక్టర్ శైలజనాథ్, ఎపి ఎస్‌సి, ఎస్‌టి లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది వై. జయరాజు (కర్నూల్), రైతు సంఘం రాష్ట్ర నేత (చిత్తూరు), రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి (కర్నూలు) మరి కొంతమంది ప్రముఖులు పాల్గొంటున్నారని తెలిపారు. ప్రముఖులు, మేధావులు అందరూ తప్పక హాజరు కావాలన్నారు.

దర్గాలో పేదలకు రొట్టెలు పంపిణీ

ప్రజాశక్తి - కడప

ప్రపంచ ప్రసిద్ధి అజ్మీర్ షరీఫ్ ఖ్వాజా గరీబ్ నవాజ్ దర్గాలో కడప మైనార్టీ నేత సుభాన్ బాషా, సుల్తాన్ బాబా,కార్పొరేటర్లు అలీ అక్బర్, షంషేర్ బాషా, చాక్లెట్, రఫీక్, అలీ, సమీర్, ఎం. బాషా కలిసి శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పేద ప్రజలకు రొట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు సుభాన్‌బాషా మాట్లాడుతూ యావత్తు ప్రపంచంలోనే అజ్మీర్ షరీఫ్ ఖ్వాజా గరీబ్ బందే నవాజ్ గురించి తెలియని వారు ఎవరు ఉండరన్నారు. ప్రజలు సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతోనే దర్గాలో ప్రార్థనలు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో సుల్తాన్ బాబా, కార్పొరేటర్లు అలీ అక్బర్, షంషేర్ బాషా పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

శిల్పారామంలో ఈ నెల 11న ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏవో శివప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు పోటీల్లో పాల్గొన దలచినవారు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ముగ్గుల పోటీలు 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటాయని పేర్కొన్నారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.5వేలు, రెండో బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2వేలు, 20 మందికి కన్సలేన్స్ బహుమతులు ఉంటాయని తెలిపారు. నగర ప్రజలు పాల్గొని ముగ్గుల పోటీలను జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

చిన్న నాగిరెడ్డిపల్లిలో లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి - వల్లూరు

మండల పరిధిలోని చిన్న నాగిరెడ్డిపల్లెలో శుక్రవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ, ఆంధ్ర ప్రదేశ్ పశుగణాభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో జాతీయ కృత్రిమ గర్భదారణ ద్వారా పుట్టిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. 42 కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన దూడలను పరిశీలించి ఆరోగ్యవంతంగా ఉండే దూడలకు మొదటి బహుమతి, రెండో బహుమతి, మూడో బహుమతులను దూడల యజమానులకు అందజేశారు. ఉప సంచాలకులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పశువులలో ఎదకు రావడానికి, ఎద లక్షణాలు వాటి ప్రాముఖ్యతను వివరించారు. డిఎల్‌డిఎ శివ రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రూ.1350 ధర నిర్ణయించి లింగ నిర్ధారిత వీర్యం ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో వైద్యులు మాధవ రెడ్డి, మారుతి ప్రతాప్ రెడ్డి, శరత్, శ్రీ హరి, వల్లూరు సిబ్బంది, రైతులు పాల్గొనారు.

బహుమతులు అందజేస్తున్న పశు వైద్య సిబ్బంది

మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో అంగనవాడీ వర్కర్స్ యూనియన్ విస్తృత సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ కూటమి పభుత్వం ఎన్నికల ముందు అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ సమ్మె సందర్భంగా తాము అధికారంలోకి రాగానే అంగన్వాడీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని చెప్పారు. ఏడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు కూటమి ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్స్‌కు వేతనాలు పెంచలేదన్నారు. పెండింగ్‌లోనే ఉన్న బిల్లులను విడుదల చేయకపోవడం దారుణమని వాపోయారు. దాదాపు రాష్ట్రంలో 5,605 సెంటర్లు మినీ అంగన్వాడీ సెంటర్‌లుగా నడుస్తున్నాయని పేర్కొన్నారు. హెల్పర్ లేకపోయినా వర్కర్ పని చేస్తున్నారని చెప్పారు. చాలా గ్రామాలలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు ఆహారాన్ని వండి పెట్టడం, ప్రీస్కూల్ నడపడం వంటి అనేక సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. మినీ వర్కర్లు ఆయా ప్రాంతాలలో కూడా లబ్ధిదారులకు ఆహారాన్ని అందిస్తున్న వారి కష్టాన్ని ఈ ప్రభుత్వం గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారందరిని గుర్తించి అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మీదేవి ఆర్.లక్ష్మీదేవి సిఐటియు కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఎన్ను కున్నారు. అంగన్వాడి వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు భాగ్యమ్మ, లక్ష్మీదేవి, గౌరవాధ్యక్షుడు జి.ఏసుదాసు ఎన్నురకున్నారు. 18 మందితో నూతన అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్ర మంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, సిఐటియు అంగ న్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సలీమా, కళావతి వరలక్ష్మి, కుసు మావతమ్మ, పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, ఉపాధ్యక్షులు ఎ. వినయ్ కుమార్, విజయ్ కుమార్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) అండర్- 12 క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారం వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టుపై నాలుగు వికెట్ల తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 35.0 ఐదు వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. ఆ జట్టులోని లిఖిత్ ఇరగంరెడ్డి 61 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని పార్థివ్ మూడు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 158 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 33.3 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసి నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ జట్టులోని జాన్సన్ 55 పరుగులు చేశాడు. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై ఒక వికెట్ తేడాతో కర్నూలు జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 33.0 ఓవర్లలో 107 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని మోక్షజ్ఞతేజ్ 36 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని యశ్వంత్ సూర్య తేజ 5 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 108 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 29.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసి ఒక వికెట్ తేడాతో విజయం సాధించింది. ఆ జట్టులోని రేవంత్ 27 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని ఉత్తేజ్ యాదవ్, హేమచంద్ర నాయక్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు.

రోడ్డు పనులు పరిశీలిస్తున్న మునిశేఖర్‌రెడ్డి

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లోని గ్రామీణ రహదారులకు మహర్దశ ఏర్పడిందని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రూ. 6 కోట్లలతో మరమ్మతు పనులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రతి గ్రామానికి ప్రాధాన్యత కల్పిస్తూ నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఎమ్మెల్యే అదేశాల మేరకు శ్రీ వేంకటేశ్వర కన్స్ట్రక్షన్ ద్వారా తొలుత ప్రొద్దుటూరు- గుడిపాడు రహదారిలో రెండు కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులకు రూ. 28 లక్షలతో పనులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. చాపాడు మండలంలోని ఆనందాశ్రమం - మొర్రాయిపల్లె రోడ్డు పనులకు రూ .25 లక్షలు, తాళ్ళమాపురం -చాపాడు, వెదురూరు రోడ్డు పనులకు రూ. 25 లక్షలు, లింగాపురం- కుచ్చుపాప రోడ్డు పనులకు రూ. 25 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. సంక్రాంతి నాటికి రోడ్డు పనులు పూర్తి కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుమేరకు గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రస్తుతం పనులు ప్రారంభించామన్నారు. ఈ పనులు సకాలంలో పూర్తిచేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూస్తామని వివరించారు. గత ప్రభుత్వంలో విస్మరించిన రోడ్లను ప్రస్తుతం బాగు చేయాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్య మంత్రి ఆలోచనలకు అనుగుణంగా ఎమ్మెల్యే కూడా రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి -ఖాజీపేట : కెసి ఆయకట్టు పరిధిలోని ఒకటవ నెంబరు ఉప కాల్వలో చేపట్టిన పూడికతీత పనులను శుక్రవారం ఎంపిటిసి సభ్యులు చంద్ర భాస్కర్ రెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి ప్రారంభించారు. రబీ సీజన్ లో రైతులకు సాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు వారు వివరించారు. ఈ పనులు చేపట్టడం ద్వారా నందిపాడు చెర్లోపల్లె, పేరా రెడ్డి కొట్టలు ప్రాంత రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ వ్యవసాయ రంగ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నారని వారు పేర్కొన్నారు.

టిటిడి చైర్మన్ రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - చెన్నూరు : బుధవారం సాయంత్రం తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఆరుగురు మృతిచెందారు. పలువురు గాయపడ్డారని, ఈ సంఘటనకు బాధ్యత వహిస్తూ టిటిడి చైర్మన్ బి.ఎన్ నాయుడు రాజీనామా చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ కమిటీ సభ్యులు పొట్టిపాడు చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని తెలిసి కూడా సరైన ఏర్పాటు చేయకపోవడం టిటిడి పాలకమండలి తప్పిదనమని, పాలకమండలి మొత్తం రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -ఖాజీపేట

మండల పరిధిలో విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా శనివారం సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు సరఫరా ఉండదని చెప్పారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విద్యుత్ తీగలు సరి చేయడం, తదితర పనుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. **చాపాడు (మైదుకూరు) :** మైదుకూరు మండల పరిధిలో రెండవ శనివారం సబ్ స్టేషన్, లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఎఇ రామభద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

యానిమేటర్ల అవినీతికి అండగా ఎపిఎం

ప్రజాశక్తి - ముద్దనూరు

వెలుగు కార్యాలయంలోని యానిమేటర్లు చేస్తున్న అవినీతికి ఎపిఎం అపర్ణ దేవి అండగా నిలుస్తూ ప్రోత్సాహిస్తున్నారని కూటమి మండల అధ్యక్షులు రాజుల సురేంద్రనాద్ రెడ్డి, కొత్తపల్లె గ్రామ కూటమి నాయకులు మోహన్ రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తపల్లె గ్రామ పంచాయతీలోని యానిమేటర్లు డ్వాక్రా సంఘాల మహిళల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు సంఘాల సభ్యులు వాపోతున్నారన్నారు. ఎపిఎం, యానిమేటర్లతో కలిసి ముడుపులు తీసుకుని వారిని కాపాడుతుందని విమర్శించారు. మండలంలోని యానిమేటర్లు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ లక్ష్యానికి పేద మహిళల ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపించారు. గతంలో మూడు గ్రామ పంచాయతీల్లో దాదాపు రూ. 2కోట్ల నిధుల దుర్వినియోగంపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం బాధాకరం అన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యుల దగ్గర వసూళ్లకు పాల్పడుతున్న యానిమేట్లకు సహకరిస్తున్న ఎపిఎం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

కోడిపందేలు ఆడితే చర్యలు తప్పవు : సిఐ

ప్రజాశక్తి - వేంపల్లె

మండల వ్యాప్తంగా ఎక్కడైనా కోడిపందేలు, పేకాట ఆడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని సిఐ సురేష్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండుగ రోజులలో సాంప్రదాయ క్రీడలు పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కోడిపందేలు, పేకాట నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జూద క్రీడలు కాకుండా సంప్రదాయ ఆటలు ఆడుకోవాలని సిఐ సూచించారు. కోడి పందేలు, పేకాట, గుండాట ఇలా ఏ జూద వ్యసనమైనా ప్రజల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనే వారిని ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించబోమన్నారు. కోడి పందేల జూదరులు, పేకాట నిర్వాహకులపై ఇప్పటికే నిఘా పెట్టినట్లు చెప్పారు. కోడి పందేలు, జూదాల వల్ల ప్రజలు సులభంగా డబ్బులు సంపాదించాలని ఆశ పడి పందేలు కాసి డబ్బును నష్టపోతున్నారన్నారు. దీనివల్ల వారి కుటుంబాలలో పండగ పూట కుటుంబం ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. కొందరు యువకులు జూదాలకు బానిసలై కేసుల్లో ఇరుక్కుపోయి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నట్లు చెప్పారు. మండలంలో ఎక్కడైనా కోడిపందేలు ఆడినా, జూదం ఆడినా సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కమిషనర్లపై దాడులు చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

కళ్యాణదుర్గం, నంద్యాల మున్సిపల్ కమిషనర్లపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయంలో నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగులునిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ కమిషనర్ శేషఫణి మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారవంఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్లు విధులు నిర్వహిస్తారన్నారు. స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవడం కుదరదన్నారు. విధుల నిర్వహణలో భాగంగా సొంత గ్రామాలను వదిలి ప్రభుత్వం నిర్ణయయం ంప్రకారం ఇతరత్రా పట్టణాలలో విధులలో చేరుతారన్నారు. ఉన్నత అధికారుల పైనే దాడులకు పాల్పడితే చిరు ఉద్యోగులకు రక్షణ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. ప్రభుత్వానికి విధేయులం తప్ప రాజకీయ పార్టీలకు విధేయులం కాదని స్పష్టం చేశారు. ఇటువంటి చర్యలు పునరావృత్తం కాకుండా అధికార యంత్రాంగం దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కార్యాలయ సిబ్బంది సచివాలయం, కార్యాలయాల సిబ్బంది, అవుట్ డోర్ సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

జమ్మలమడుగు ఎస్‌పి డిగ్రీ కళాశాలలో భోగి మంటలు

ఎస్‌పి డిగ్రీ కళాశాలలో..

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్ : సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలిసి ముందస్తు సంక్రాంతి సంబరాలు శుక్రవారం నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు రంగవల్లులతో కళాశాల అవరణాన్ని అలంకరించారు. అనంతరం ఎద్దుల బండి కట్టి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి రైతులు చేసుకునే ప్రధాన పండుగ అన్నారు. రైతులకు ఇంటికి ధాన్యం చేరిన తరువాత కొత్త దుస్తులు ధరించి మూడు రోజుల పాటు బంధువులతో కలిసి నిర్వహించుకుంటారని తెలిపారు. ఇది దేశ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పలుకుతుందన్నారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యాజమాన్యం దంపతులు, ఎన్‌సిసి లెఫ్టినెంట్ కమాండెంట్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

విఆర్ జూనియర్ కళాశాలలో..

చాపాడు(మైదుకూరు) మైదుకూరు పట్టణంలోని విఆర్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎస్.వెంకట రాముడు మాట్లాడుతూ తెలుగు సాంప్రదాయానికి సంక్రాంతి పండుగ నిదర్శనం అన్నారు. రైతులు పాడిపంటలు పండించి ధాన్యాన్ని ఇంటికి తెచ్చుకునే వేళ మూడు రోజులపాటు కుటుంబాలతో కలిసి నిర్వహించుకునేది సంక్రాంతి పండగ అన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన పావని, నవ్యశ్రీ, నందిని,సుమేధ, లోహిత,సంగీతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తిరుమలేశు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు ఎస్ఆర్ఐటిలో..

ఎస్ఆర్ఐటిలో..

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం కళాశాల మేనేజెమెంట్, ప్రిన్సిపల్, హెచ్ఒడిలు, స్టాఫ్, విద్యార్థులచే అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రూరల్ సిఐ బాల మద్దిలేటి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల వాతావరణంచూస్తూ ఉంటే మా ఊరిలో సంక్రాంతి పండుగ జరుపుకున్నట్లు ఉందని అన్నారు. చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర రెడ్డి మాట్లాడుతూ పాల్గొన్న ప్రతి ఒక్కరూ సంప్రదాయక దుస్తులు ధరించి, ఉత్సాహంగా సంబరాలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కరస్పాడెంట్ వీరకళ్యాణ్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు శ్రమించి గ్రామీణ వాతావరణాన్ని సృష్టించి సంక్రాంతి పండుగ ముందే వచ్చిందన్నా స్పృహ కల్పించారని కొనియాడారు. ప్రిన్సిపల్ డా. పాండురంగన్ రవి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులలో ఐకమత్యం అలవడుతుందని చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. వెంకటేశ్వరెడ్డి మాట్లాడుతూ సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయన్నారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థులచే నిర్వహించిన రంగోలి, కోలాటం, ఉత్తమ వస్త్రాలంకరణ, పిండి వంటలు,చెక్క భజన, సాంస్కృతిక కార్యక్రమాలు, ఫొటోగ్రఫీ, చిత్రలేఖనం, బొంగరాలట, హరిదాసుల కీర్తనలు, ఆద్యంతం సంప్రదాయ భరితంగా కేరింతల మధ్య ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాడెంట్ వీరకల్యాణ్ రెడ్డి, హెచ్ఒడిలు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో..

పులివెందుల టౌన్ : పట్టణ పరిధిలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ప్రిన్సిపల్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో భోగిమంటలు వెలిగించి, ముగ్గులు వేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆనందంగా పండుగను జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నీరజ, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

కందుల విద్యా సంస్థల్లో..

కడప అర్బన్ : కందుల విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. గంగి రెద్దుల కోలాహలం, హరిదాసుల సందడి, భోగి మంటలు, ఆటపాటలు, భోగిళ్ల గొప్ప తనాన్ని కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ విద్యార్థులకు తెలియచేశారు. విద్యార్థులంతా సంప్రదాయ దుస్తులు ధరించి అలరించారు. విద్యార్థులు గాలి పటాలను ఎగురవేశారు. కళాశాల యండి డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ వి. ఎస్.ఎస్ మూర్తి సాంప్రదాయ దుస్తులు ధరించి ఎడ్ల బండి పై వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భోగి స్నాలను గురించి వివరించారు. సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. ముగ్గుల పోటీ లతో పాటు వివిధ రకాల ఆటల పోటీలు, భోగిమంటలు వేసి, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంబరాలు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్, డీన్ లు, విభాగాధిపతులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు రవీంద్ర ఉన్నత పాఠశాలలో..

రవీంద్ర ఉన్నత పాఠశాలలో..

ప్రొద్దుటూరు : రామేశ్వరంలోని శ్రీ రవీంద్ర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు, భోగిమంటలు, భోగినృత్యాలు, భోగిపల్ల స్నానాలు లక్ష్మీపూజ, డూడూ బసవన్నల ఆటలు, గొబ్బిమ్మ పాటల నృత్యాలు, సంక్రాంతి పాటల నృత్యాలు, కోడి పందేలు, హరిదాసులు ,కట్టెసాము, బుడబుక్కల వాళ్లతో సందడి చేశారు. తెలుగుదనం ఉట్టిపడేలా కార్యక్రమాలు నిర్వహించారు. శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్ట్ ఫౌండర్ ట్రస్టీ శివదర్శనానంద సరస్వతి ఆధ్వర్యంలో పాఠశాల నిర్వాహకులు పల్లేటి ప్రభాకర్‌రెడ్డి,పల్లేటి విష్ణుకుమార్‌రెడ్డి నేతృత్వంలో కార్యక్రమాలు అసాంతం ఉత్సాహభరితంగా నిర్వహించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప కందుల విద్యా సంస్థలో..

ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుంది

- మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నేరవేరుస్తుందని అందుకు సిఎం చంద్రబాబు నాయుడు కట్టుబడి ఉన్నారని మాజీ ఎమెల్సీ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఇమాం నగర్ వీధిలో రూ.7.50 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారభించారు. అంతకు ముందు శ్రీ వృషబాచలేశ్వర స్వామి దేవస్థానాన్ని, ఎద్దుల కొండపై ఏర్పాటు చేసిన వైకుంఠ దర్శనంకు వెళ్లి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అలయం విశిష్టతపై ఆలయ అధికారులు, అర్చకులు తెలియ జేశారు. మాజీ ఎమ్మెల్సీ బిటెక్ ఎద్దుల కొండపైకి రావడంతో ఆలయ అధికారులు శాలువతో ఘనంగా సత్కరించారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని పాలక మండలి మాజీ సభ్యుడు పివి రమణ, ఇఓ విశ్వనాథ్ రెడి బిటెక్ ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లును వేస్తున్నారని చెప్పారు. గత పాలకులు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, అందుకే ఇచ్చిన హామీలను నేర్చేందుకు కొద్దిగా ఆలస్యంగా అవుతుందని తెలిప్పారు. హామీలు మాత్రం తప్పకుండా అమలు చేస్తామని చెప్పారు. సిమెంటు రోడ్లు పనులు నాణ్యతగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న బిటెక్ రవి

శ్రీ వృషబాచలేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి కూడ దేవాదాయ శాఖ మంత్రితో కలిసి చర్చిస్తామని చెప్పారు. అనంతరం టిడిపి నాయకులు, కార్యకర్తలను కలుసుకొని వారి సమస్యలను విన్నారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్.పి. జయరామిరెడ్డి, రజనీకాంత్ రెడ్డి, మహమ్మద్ ఇనాయతుల్లా బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి, పిఆర్ డిఇ సుధాకర్ రెడ్డి, ఎఇ శ్రీనివాసులుతో పాటుపలువురు టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలపై సమగ్ర సర్వే : వ్య.కా.స

సమావేశంలో మాట్లాడుతున్న వ్య.కా.స నాయకులు

ప్రజాశక్తి - గోపవరం

బద్వేల్ నియోజకవర్గంలోని దళిత వాడల సమస్యల పై ఈనెల 10 నుంచి 25 వరకు వరకు సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్ తెలిపారు. శుక్రవారం ఉదయం బద్వేల్ పట్టణం సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దాదాపు 16 సంవత్సరాల నుంచి ఎస్‌సి నియోజకవర్గంగా బద్వేల్ రిజర్వుడు చేసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేసి దళితులను, దళిత కాలనీలను ఆర్థికంగా, సామాజికంగా ఆదుకోలేదని చెప్పారు. కేవలం శాసనసభ సభ్యులు స్థానంగా కేటాయించి రిజర్వ్ చేసి పాలకులు గాలికి వదిలేశారన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు పూర్తయినా దళిత వాడల్లో శ్మశాన. వాటికలు, సిమెంట్‌రోడ్లు, ఇళ్లు, తాగునీరు, వీధి దీపాలు వంటి సౌకర్యాలు లేవని వాపోయారు. ఫ్లోరైడ్ నీటితో కీళ్ల నొప్పులు, విష జ్వరాలతో బాధపడుతున్నారని చెప్పారు. వలసల నివారణకు గ్రామీణ ఉపాధి పనులలో కూడా వివక్షత చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి చేసిన పనులకు బిల్లులు చెల్లించటం లేదన్నారు. విస్తారంగా ప్రభుత్వ భూములున్నా భూ పంపిణీకి నోచుకోవటం లేదని పేర్కొన్నారు. కుల వివక్ష ఎక్కువగా ఉందని, వీటన్నిటి పైన సమగ్ర సర్వే చేసి ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట ఈనెల 27న ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అట్లూరు వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఇ. రమణ, బి.కోడూరు మండల కార్యదర్శి ఓబయ్య, చిన్నయ్య, చిన్న, బద్వేల్ మండల కార్యదర్శి రవిచంద్ర, రామ సుబ్బయ్య, పుష్పమ్మ పాల్గొన్నారు.

ఆలయాల్లో ముక్కోటి వేడుకలు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీ కోదండ రామాలయంలో శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే కోదండరామాలయానికి ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు.. వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వారా ప్రవేశం కల్పించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పెద్దఎత్తున అన్న దానం చేశారు. ఆలయానికి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మేడా విజయ శేఖర్‌రెడ్డి ఇంకా చాలా మంది ప్రముఖులు ఆలయానికి వచ్చారు. ఒంటిమిట్ట కోదండ రామాలయం దగ్గర భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఒంటిమిట్ట సిఐ బాబు బందోబస్తు ఏర్పాటు చేశారు. **పులివెందుల టౌన్ :** వైకుంఠ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని ఆలయాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా పురాతనమైన రంగనాథ స్వామి దేవాలయం, పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవాలయములలో వేకువ జామున నుంచి భక్తులు భారీగా బారులు తీరి ఉత్తర ద్వార దర్శనాన్ని చేసుకున్నారు. పట్టణ పరిధిలోని ఉలిమెల్లలో వెలసిన శ్రీ భూదేవి శ్రీదేవి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బండ లాగుడు పోటీలను కూడా నిర్వహించారు. పోటీలలో గెలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. భక్తులకు ఆలయ కమిటీ తీర్థ, నైవేద్యాల తోపాటు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. **సింహాద్రిపురం :** మండల వ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోనిశ్రీ వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు హరి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామివారికి భక్తులు పట్టువస్త్రాలను సమర్పించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం స్వామివారిని గ్రామ పురవీధులలో బ్యాండ్ మేళాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు చేపట్టిన కోలాటం ఎంతో ఆకట్టుకుంది. **వేంపల్లె :** వైకుంఠ ఏకాదశి సందర్భంగా దేవాలయాలు కళకళలాడినాయి. మహిళలు ఏకాదశి పూజలు చేపట్టారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేంపల్లెలోని శ్రీ వృషబాచలేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన ఎద్దుల కొండపై, నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల కోసం ఉత్తర ద్వారం గుండా దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఆలయాల్లో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేశారు. దీంతో తెల్లవారుజామున నుండే భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకొనేందుకు బారులు తీశారు. అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేపట్టారు. భక్తులు ఎద్దుల కొండపైకి వెళ్లేందుకు ఆలయ అధికారులు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

పులివెందుల టౌన్ : క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

విద్యార్థులకు కవితా పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా రచయితల మహాసభల్లో భాగంగా నవ తరానికి, నవ కవనానికి నాంది పలుకుతూ పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల విద్యార్థులకు కవితా పోటీలు ఏర్పాటు చేశామని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. శుక్రవారం కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ సి సూర్య రావు ఆధ్వర్యంలో రచయితల సంఘం సభ్యురాలు డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి, తెలుగు అధ్యాపకులు మార్తల శ్రీనివాస రెడ్డి పర్యవేక్షణలో కవితా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీల్లో 100 మందికి పైగా మహిళలు పాల్గొని పర్యావరణం- పరిరక్షణ అనే అంశంపై కవితలు రాశారన్నారు. ఈ పోటీల్లో వరుసగా వి ప్రహర్షిత, షేక్ అయేషా, విజయశ్రీలు ప్రథమ (3000), ద్వితీయ(2000), తృతీయ(1000) బహుమతులు సాధించారని పేర్కొన్నారు. ఫిబ్రవరి 8, 9 తేదీల్లో కడప ఐఎంఎ హాల్లో జరిగే మహాసభల్లో గెలుపొందిన విద్యార్థులు తమ కవితలు ఆలపిస్తారన్నారు. కార్యక్రమంలో కవి డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరా చారి, శ్రీవాణి, అరుణకుమారి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులు తప్పక వైద్య పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని జ్యోతి హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ జ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని కామనూరు ప్రాథమిక అరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం వైద్యాధికారి డాక్టర్. హనీఫ్ బాబా, జ్యోతి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జ్యోతి గైనకాలజిస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని, మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. కాన్పులు ఆసుపత్రిలో నిర్వహించాలని చెప్పారు. అంగన్వాడీలో లభించే సేవలను పొందాలని తెలిపారు. పిహెచ్‌సి పరిధిలోని గ్రామాల నుండి 26 మంది గర్భిణులు హాజరయ్యారు. వీరిలో ఏడుగురిని హైరిస్క్ గర్భిణులుగా గుర్తించారు. అందరికి ఆరోగ్య పరీక్షలు, సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సిహెచ్ఒ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ చంద్రకళ, వర ప్రసాద్, సిహెచ్ఒ గౌతమీ, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్, ఎఎన్ఎం నాగ సుహాసిని, గోవిందమ్మ, లలిత ఆశా కార్యకర్తలు పుష్ప, ప్రభావతి, నాగలక్ష్మి, శ్రీవాణి, బాలనాగమ్మ, ప్రసన్న పాల్గొన్నారు.

మినీ గోకులాలతో పాడి రైతులకు లబ్ధి

ప్రజాశక్తి - చాపాడు : మినీ గోకులాలతో పాడి రైతులకు ఎంతో లబ్ధి చేకూరిందని టిడిపి మండల శాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలో నూతనంగా నిర్మించిన 15 మిని గోకులాలను శుక్రవారం ఎంపిడిఒ వీరకిషోర్, ఉపాధి ఎపిఒ జగదీశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల పాకలను రైతులు స్వతహగా నిర్మించుకోవాలంటే ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నందున ప్రభుత్వం మినీ గోకులాలకు నిధులు మంజూరు చేసిందన్నారు. రైతు వాటాగా కేవలం రూ.23 వేలు చెల్లిస్తే, ప్రభుత్వ వాటాగా రూ.2.07 లక్షలు చెల్లిస్తుందన్నారు. చాపాడు మండల వ్యాప్తంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ రైతులకు 25 మినీ గోకులాలను మంజూరు చేయించారన్నారు. ప్రస్తుతం మదూరు అన్నవరం చాపాడు అల్లాడుపల్లె తదితర గ్రామాల్లో పూర్తయిన వాటిని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లోకేశ్వర్ రెడ్డి, శివరామకృష్ణారెడ్డి, వీరారెడ్డి, వీరశేఖర్ రెడ్డి, సుబ్బారెడ్డి, ఉపాధి సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - సింహాద్రిపురం: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని కోరగుంటపల్లి ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు స్రవంతి, డిప్యూటీ డెమో రవణమ్మ పేర్కొన్నారు. శుక్రవారం కోరగుంటపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భస్థపూర్వ , పిండ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు ఆస్పత్రికి వెళ్లి స్కాన్ చేయించుకునేటప్పుడు డాక్టర్లను ఆడ, మగ గురించి అడగరాదన్నారు. అలా అడిగితే అడిగినవారికి, చెప్పిన వారికి మొదటిసారి శిక్షకు రూ. 10 వేలు జరినామా మూడేళ్ల జైలు శిక్ష, రెండో సారి చెబితే రూ 50. వేల జరినామా, ఐదేళ్ల జైలు శిక్ష పడుతుందని పేర్కొన్నారు. సంబంధిత ఆస్పత్రిని మూసి వేస్తారన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రాధ, ఖలీల్ బాషా, కార్యకర్తలు, ఆశాలు, మరియు అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో తప్పుకున్నారా?

ప్రజాశక్తి - వేంపల్లె : వైసిపి ప్రభుత్వ పాలనలో ఘటనలు చోటు చేసుకున్నప్పుడు అప్పుటి పాలకులు ఒకరైనా విధుల నుంచి తప్పు కున్నారా అని బ్రాహ్మణ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ రావు, రాష్ట్ర ప్రచార అధ్యక్షులు రఘునాథ్ రావు శుక్రవారం ఒక సంయుక్త ప్రటకనలో పేర్కొన్నారు. తిరుపతిలో చోటు చేసుకున్న ఘటన చాలా బాధాకరమన్నారు. ఘటనకు ప్రభుత్వం బాధ్యత వహించాలని మాజీ దేవదాయ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్ విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత వైసిపి పాలనలో నరసింహ స్వామి దేవాలయంలో రథాన్ని కాల్చినప్పుడు, తిరుమలలో నెయ్యి కల్తీ జరిగినప్పుడు వైసిపి ప్రభుత్వం ఎందుకు బాధ్యత వహించలేదని ప్రశ్నించారు. దేవాదాయ శాఖ సలహాదారుగా ఉండి కూడా చిన్న దేవాలయాలను కూల్చివేయడం పట్ల ఎందుకు ఖండించలేకపోయారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిని చిత్తశుద్ధి లేని వ్యక్తి అనడం విడ్డూరంగా ఉందని చెప్పారు.